క్లుప్తంగా

కోట గంగమ్మకు పూజలు

కమలాపురం : స్థానిక కోట వీధిలో వెలసిన శ్రీ కోట గంగమ్మ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కోట గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. కాయక ర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

పరిమళించిన మానవత్వం

జమ్మలమడుగు : అనాథ శవాలకు అంత్యక్రియలను నిర్వహించి మానవత్వం చాటుకుంటున్నారు మేఐహెల్ప్‌యు సంస్థ సభ్యులు. సోమవారం పెద్దముడియం మండలం కొండ సుంకేసుల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆశ్రమంలో ఉన్న ఆకుల పుల్లయ్య (72) అనారోగ్యంతో మరణించారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ రాలేదు.విషయం తెలుసుకున్న మే ఐ హెల్ప్‌యూ ఫౌండర్ లక్ష్మణ్ మోరే సిబ్బందితో కలిసి హిందూ సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సుభహాన్, మునేంద్ర, శ్రీకాంత్, రాజశేఖర్, వెంకట లక్షుమ్మ పాల్గొన్నారు.

అరటి తోట దగ్ధం

వేముల : మండల పరిధి వేల్పుల గ్రామంలోని రెడ్డయ్యరెడ్డి అనే రైతుకు చెందిన అరటి తోట అగ్నికి ఆహుతైంది. గ్రామానికి సమీపంలో తోట ఉండడంతో ఎవరో ఆకతాయిలు సిగరెట్ తాగి ఆర్పివేయకుండా అక్కడ పడేయడంతో మంటలు చెలరేగాయి. తోటలో ఎండిన ఆకులు ఉండడంతో వేగంగా మంటలు వ్యాపించి 2.50 ఎకరాలలో అరటి పంట పూర్తిగా కాలిపోయింది. గెలలు కోతకు వచ్చే సమయంలో అరటి తోట కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని రైతు వాపోతున్నాడు. అంతేకాక అరటితోటలో నీటి తడులు అందించేందుకు ఏర్పాటు చేసిన డ్రిప్పు పరికరాలు కూడా పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల మేర రైతుకు నష్టం వాటిల్లింది.

వైఎస్సార్ ఉలిమెల్ల లేక్‌లో ఉగాది సంబరాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని డా.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ సుధాకర్ తెలిపారు. ఉగాది పండుగ రోజున సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ రాజా కళానిలయం, పులివెందుల చిన్నారులతో డ్యాన్స్ మాస్టర్ రాజా ఆధ్వర్యంలో, 11న రంజాన్ పండుగను పురస్కరించుకుని మహేశ్ ఎస్‌కె ఫిల్మ్ స్టూడియో శ్రీ డ్యాన్ మాస్టర్ శర్వన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఉంటాయన్నారు. 17న శ్రీరామ నవమిని పురస్కరించుకుని స్థానిక విజయవాడ ఎక్సలెంట్ ఇన్‌స్టిట్యూట్ వారి నాగార్జున (ఇంగ్లీషుమీడియం) స్కూల్, పులివెందుల చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

■ పట్టణ శివార్లలోని శిల్పారామంలో కూడా ఉగాది, రంజాన్, శ్రీరామనవమి పండుగలను పురస్కరించుకుని పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా గోడపత్రాలను ఆవిష్కరించారు.

నివాళి

కమలాపురం : కమలాపురం ఎంపీపీ గండి భారతి మామ రిటైర్డ్ డీఈ గండి సుబ్బరాయుడు (85) మృతదేహానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి ఉన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం


బాబానగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజల సంక్షేమమే జగనన్న లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగర పరిధిలోని 17వ డివిజన్‌లోని బాబానగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి, వేయించి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డిని, ఎమ్మెల్యేగా పి రవీంద్రనాథరెడ్డి అనే నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయన్నారు.ఇతర రాష్ట్రాలు సైతం ఈ పథకాలను ప్రజలకు అందించాలని సిద్ధపడుతున్నారంటే ప్రజా సంక్షేమం ఏ విధంగా జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ చేస్తున్న కుయుక్తులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్ రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి, 16వ డివిజన్ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్ రెడ్డి, ఏపీ ఈడిగా కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, భూ కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు మునయ్య , నారే నాగరాజు, ప్రసాద్ రెడ్డి, సర్పంచులు నాగముని, వర్దిరెడ్డి సురేంద్ర రెడ్డి, ఉప సర్పంచ్ లక్కిరెడ్డి రమణారెడ్డి, నాయకులు గుత్తిరెడ్డి లక్ష్మీరెడ్డి, నీలకంఠ రెడ్డి, గుడా రాజశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం,అభివృద్ధికి పట్టం కడదాం


పెద్దపసుపుల: ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

పెద్దముడియం : సంక్షేమం,అభివృద్ధికి పట్టం కడదామని ఎమ్మెల్యే డా.సుధీర్ రెడ్డి తెలిపారు.సోమవారం ఆయన మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో మార్కెట్ యార్డు చైర్మన్ పీవీ రమణారెడ్డి,నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమం,అభివృద్ధి సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్,సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను తీసుకొచ్చారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో ప్రజల గురించి ఆలోచించిందా అని అన్నారు.గడప గడపకు మన ప్రభుత్వం,పార్టీ కార్యక్రమాల ద్వారా ప్రజా ప్రతినిధులందరూ ప్రజలతో మమేకమయ్యారని చెప్పారు. నిస్వార్థంగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలను అడ్డుకొని పండుటాకులను రోడ్డున పడేలా చేసిన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు ఓటర్లు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే తెలిపారు.ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను,ఎంపీ అభ్యర్థిగా అవినాష్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలిపారు. కార్యక్రమంలో పద్మనాభరెడ్డి,సర్వేష్ రెడ్డి,కిరణ్ కుమార్ రెడ్డి,బి.చెన్నారెడ్డి,శ్రీరాముడు,పవన్ కుమార్ రెడ్డి,చిన్న చెన్నారెడ్డి,రాఘవరెడ్డి, జి.వెంకటేశ్వరరెడ్డి, బి.రమణారెడ్డి, నూకల సుబ్బయ్య,గుండు మల్లయ్య,ధన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సువర్ణ పాలన


పులివెందులలో ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల కోసం అందించిన సంక్షేమ పాలన వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారని, ఆయనతోనే సువర్ణ పాలన సాధ్యమవుతుందని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, కొంగనపల్లి మురళీలతో కలసి మారుతీహాల్ రోడ్డు, శ్రీరామహాల్ రోడ్డు, పట్టాభి కాంప్లెక్స్, బైపాస్ రోడ్డు, మండివీధి, అంకాలమ్మపేట, తదితర ప్రాంతాల్లో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీకి పోటీ చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్లమెంట్‌కు పోటీచేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డికి మీ అమూల్యమైన రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి, వేయించి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు పార్నపల్లి కిశోర్, చంద్రమౌళి, కోఆప్షన్ చంద్రమౌళి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డేనియల్‌బాబు, అంకాలమ్మ ఆలయ చైర్మెన్ నాగేంద్రప్రసాద్, మాజీ ఓఎస్డీ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా యూత్ నాయకులు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు కోడిరమణ, రంగనాయకులు, రాము, సిద్దయ్య, మాజీ కౌన్సిలర్లు కోళ్లభాస్కర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త రవికుమార్, బలిజ సంఘ నాయకులు సోపాలవీరా, వాల్మీకిసంఘు కార్పొరేషన్ డైరెక్టర్ అంబకపల్లె నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగబాబుయాదవ్, పద్మనాభరెడ్డి, సంపత్, ఖాదర్‌బాషా, శ్రీరాములు,శ్రీరామసుబ్బయ్య, మస్తాన్‌వల్లి, నాగరాజు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి


ఎర్రగుంట్ల: వృద్ధురాలిని పలకరిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఎర్రగుంట్ల : సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే ప్రతి ఓటరు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిలను గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం 3వ వార్డులోని సుందరయ్య కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భాస్కర్, కో–ఆప్షన్ సభ్యులు డి సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు రాజారెడ్డి, రఘురాముడు, సురేష్, వజ్రా డేవిడ్ పాల్గొన్నారు.

ముస్లింలకు పవిత్ర మాసం రంజాన్


ఇఫ్తార్ విందులో ప్రార్థన చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, తదితరులు

పులివెందుల : ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని వీజే ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో ఉపవాస దీక్షను ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థన చేసి విరమించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు సంతోషంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని అల్లాను ప్రార్థించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ రసూల్, ముస్లిం మైనార్టీ సంఘం నాయకులు నూరుల్లా, కౌన్సిలర్లు ఖాదర్, మస్తాన్‌వలి, సిద్ధయ్య, కోడిరమణ, కిషోర్, జహీర్, మహమ్మద్ రఫి, ముస్లిం సోదరులు, మత పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా కొండగంగమ్మ తిరునాల

పెండ్లిమర్రి : ఉగాది పండుగను పురస్కరించుకొని మండలంలోని నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండ గంగమ్మ తిరునాల రెండో రోజు సోమవారం ఆలయ కార్యనిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు గణపతి పూజ, ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వీరికి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలు అధిరోహించాలి



ఆర్‌జేడీ రాఘవరెడ్డిని సన్మానిస్తున్న సీఎంఓ సాయి రమేష్

కమలాపురం : ప్రతి విద్యార్థి గురువులు బోధించే పాఠాలు విని, ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని పాఠశాల విద్య ఆర్‌జేడీ రాఘవరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధి నల్లింగాయపల్లెలోని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్)లోని లూయిస్ వైకా డీఏవీ భారతి విద్యా మందిర్ 5వ వార్షికోత్సవ వేడుకలను సీఎంఓ సాయి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌జేడీ విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులకు చక్కటి విద్యాబుద్ధులు నేర్పేందుకు పరిశ్రమ యాజమాన్యం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసిందన్నారు. అందుకు తగ్గట్టుగా ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం కూడా ఉందన్నారు. అయితే ఉపాధ్యాయులు బోధించే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని అర్థం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. లక్ష్యం నిర్దేశించుకుని కృషి చేస్తే విజయం సాధించవచ్చన్నారు. 2020 నూతన విద్యా విధానం ప్రకారం విద్యార్థులకు విద్యా బుద్ధులు బోధిస్తూ అన్ని రంగాలలో ముందంజలో ఉన్న డీఏవీ భారతి విద్యా మందిర్ పాఠశాల, యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం సేవలను ఆయన కొనియాడారు. డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి మాట్లాడుతూ 2020 నూతన విద్యా విధానం భారతదేశ ఆత్మలో నిగూఢమై ఉన్న జ్ఞాన నిధిని వెలికి తీసి విశ్వ మానవాళికి మేలు చేయడంలో గొప్ప పాత్రను పోషించబోతుందన్నారు. ముఖ్యంగా ఏ పాఠ్యాంశాలు ఆ రోజు చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. విద్య పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. సీఎంఓ సాయి రమేష్, పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీ గోపాల్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ భార్గవ్‌రెడ్డి, వేంపల్లె ఎంఈఓ జాఫర్ సాదిక్, ప్రిన్సిపల్ కిషోర్ కుమార్ మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తరువాత ముఖ్య, విశిష్ట అతిథులను ఘనంగా సత్కరించారు.

పంచాయతీ అభివృద్ధిపై సమీక్ష

సింహాద్రిపురం : పంచాయతీ అభివృద్ధిపై మండల సభాభవనంలో సోమవారం సంబంధిత అధికారులతో ఎంపీడీఓ సాల్మన్‌రాజ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధుల లభ్యతనుబట్టి పనుల ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలిపిన విధంగా ప్రతి సంవత్సరం గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించాలన్నారు. అన్ని శాఖల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు సరైన సమాచారం తీసుకుని ఆన్‌లైన్‌లో రెండు, మూడు రోజుల్లో అప్‌లోడ్ చేయాలన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ దివాకర్, ఎంపీపీ వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల సభాభవనంలో ఎంపీడీఓ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి రైతులకు అవసరమైన ఎరువులు, మందులు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే ఉపాధిహామీ పథకం కింద పనులు చేస్తున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథరెడ్డి, వ్యవసాయ అధికారి నాగలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాబున్ని, డీఆర్డీఏ శాఖ అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

లింగాల : నూతన తెలుగుసంవత్సరాది క్రోధినామ సంవత్సర వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా ఎగువలింగాల గ్రామంలో బుధవారం పార్వేట నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

పండుగకు వెళ్తూ .. వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన సురేష్

ముద్దనూరు : ముద్దనూరు–పులివెందుల ప్రధాన రహదారిలో నల్లబల్లె వంక సమీపంలో సోమవారం సాయంత్రం సురేష్ (25) దుర్మరణం చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. నంద్యాల జిల్లా సంజామల మండలం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సురేష్ పులివెందులలోని ఓ ప్రైవేట్ బస్సు ట్రావెల్స్‌లో క్లీనర్‌గా పని చేస్తున్నాడు. పండుగ కోసం సొంత గ్రామానికి మోటార్‌బైక్‌పై వెళ్తున్నాడు. నల్లబల్లె గ్రామం దాటి ముద్దనూరుకు వస్తుండగా బైక్ అదుపు తప్పి రహదారి పక్కనే పొలానికి వేసిన కంచె దిమ్మెకు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సురేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ దస్తగిరి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.